జీడిమెట్ల గ్రామంలో వీధి కుక్కల పట్టివేత


వీధి కుక్కలను పట్టుకెళ్తున్న సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పేట్‌బషీరాబాద్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): బాలుడిపై కుక్కదాడి అనే శీర్షికతో ఈనెల 10వ తేదీన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించారు. వైద్యాధికారి లింగస్వామి జీడిమెట్ల గ్రామంలో కుక్క కాటుకు గురైన బాలుడిని పరామర్శించారు. గ్రామంలో వీధి కుక్కలను డాగ్ స్క్వాడ్ పట్టుకెళ్లింది.

కుత్బుల్లాపూర్ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

షాపూర్‌నగర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ చేపట్టిన కృతజ్ఞత యాత్ర ఆరో రోజుకు చేరింది. శుక్రవారం లక్ష్మీనగర్, అయ్యప్ప సొసైటీ, సూరారం విలేజ్, విశ్వకర్మ కాలనీల్లో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుత్బుల్లాపూర్‌లో గెలిచింది తాను కాదని, ప్రజలందరూ అని అన్నారు. తనను మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించినందకు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గం మరింత అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, బీఆర్‌ఎస్ నాయకులు రాఘవరెడ్డి, అమృత రెడ్డి, జంగారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, సిద్దిక్, ఓం. బాలేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఓల్డుబోయినపల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని బోయినపల్లి ఏడీఈ శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. చందనా ఆస్పత్రి ఏరియాలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎస్వీ కో-ఆపరేటివ్ పరిధి ఓబ్లం ప్రాంతంలో, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు లయన్స్ క్లబ్ బాలానగర్ రాజు కాలనీ ప్రాంతంలో విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

మియాపూర్: కేఎస్‌ఆర్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. కేఎస్‌ఆర్ రోడ్డు నెంబర్ 2, 4, 6, 8, 9, 20, పీజేఆర్ రోడ్డునెంబర్ 1, 3, 5, 7, 10, 12 ప్రాంతాల్లో, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు శాంతినగర్, ఉషోదయ అపార్ట్‌మెంట్స్ దీప్తిశ్రీనగర్‌లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

'ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి'

జీడిమెట్ల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని టీయూటీఎఫ్ నాయకులు కుత్బుల్లాపూర్ మండల విద్యాధికారి అంజనేయులుకి వినతిపత్రం అందజేశారు. ఎంతో కాలంగా ఉమ్మడి కుత్బుల్లాపూర్, బాలానగర్ మండల ఉపాధ్యాయుల సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

గడువుకన్నా ముందే పూర్తి చేస్తాం

- వేగంగా అభయ హస్తం దరఖాస్తుల డాటా ఎంట్రీ

కుత్బుల్లాపూర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): అభయ హస్తం దరఖాస్తుల డాటా ఎంట్రీ వేగం పెంచేందుకు కుత్బుల్లాపూర్, గాజుల రామారం జంట సర్కిళ్ల అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. సర్వర్‌లో ఇబ్బందులు ఏర్పడకపోతే ఉన్నతాధికారులు నిర్దేశించిన గడువుకన్నా ఒకటి, రెండు రోజుల ముందే డాటా ఎంట్రీ ప్రక్రియను పూర్తి చేస్తామని అధికారులు అంటున్నారు. గురువారం సర్వర్ డౌన్‌తో డాటా ఎంట్రీ మందగించడంతో శుక్రవారం అదనంగా మరో సర్వర్‌ను అనుసంధానం చేశారు. మూడు షిఫ్టుల్లో దరఖాస్తుల డాటా ఎంట్రీ చేస్తున్నారు.

కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో 4 డివిజన్ల నుంచి 74,022 దరఖాస్తులు అందాయి. శుక్రవారం నాటికి సుమారు 58,345 దరఖాస్తుల డాటా ఎంట్రీ పూర్తయినట్లు అధికారులు తెలిపారు. గాజులరామారం సర్కిల్ పరిధిలో 4 డివిజన్ల నుంచి 74,129 దరఖాస్తులు అందాయి. శుక్రవారం నాటికి సుమారు 65,177 దరఖాస్తుల డాటా ఎంట్రీ పూర్తయినట్లు అధికారులు తెలిపారు.

మనూలో ముగిసిన టీచర్ ట్రైనింగ్ శిక్షణ

హైదరాబాద్ సిటీ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నూతన విద్యావిధానం అమలులో భాగంగా మాలవీయ మిషన్ ఆధ్వర్యంలో మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీలో నిర్వహించిన టీచర్ ట్రైనింగ్ శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఎంఎంటీటీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ సనీమ్ ఫాతిమా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో శిక్షణలో పాల్గొన్న అధ్యాపకులకు నూతన విద్యావిధానానికి సంబంధించి మల్టీ డిసిప్లీనరీ ఎడ్యుకేషన్, ఇండియన్ నాలెడ్జ్ సిస్టం, అకడమిక్ లీడర్ షిప్ వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు.

తెలంగాణ సరిహద్దు వరకే ఉచిత ప్రయాణం

బాలానగర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సరిహద్దు వరకే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణమని డిప్యూటీ రీజనల్ మేనేజర్ కవిత, కూకట్‌పల్లి డిపో మేనేజర్ ఇసాక్ బిన్ అహ్మద్ తెలిపారు. సంక్రాంతి పండగ కోసం ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు.

జగద్గిరిగుట్ట నుంచి హన్మకొండ వరకు, బీరంగూడ లింగంపల్లి, చందానగర్, కేపీహెచ్‌బీ నుంచి ఆంధ్రా ప్రాంతాలైన విజయవాడ, ఏలూరు, కాకినాడ, రాజమండ్రి, అమలాపురానికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని చెప్పారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చన్నారు. ఈ పథకంలో భాగంగా తెలంగాణ సరిహద్దు వరకే ఉచితంగా ప్రయాణించవచ్చన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి : కార్పొరేటర్

ఓల్డుబోయినపల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానని ఓల్డుబోయినపల్లి డివిజన్ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ అన్నారు. ఎల్‌బీనగర్ అసోసియేషన్ శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. మహిళలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. డివిజన్ ప్రజలకు భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళా అధ్యక్షురాలు లలిత, మన్నె ఉదయ్ యాదవ్, మల్లమ్మ, నిరమల తదితరులు పాల్గొన్నారు.

చిత్తారమ్మ జాతరకు ఏర్పాట్లు

షాపూర్‌నగర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఈనెల 19 నుంచి 27 వరకు జరగనున్న గాజులరామారం చిత్తారమ్మదేవి జాతరకు ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి గుడిని విద్యుత్ లైట్లతో అలంకరిస్తున్నారు. ఫ్లెక్సీలు, కమాన్‌లు ఏర్పాటు చేస్తున్నారు.

జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ కమిటీ ఛైర్మన్ కూన అంతయ్యగౌడ్ తెలిపారు. ఈనెల 21న అమ్మవారి ప్రధాన జాతర జరుగుతుందన్నారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంతి

కూకట్‌పల్లి/కుత్బుల్లాపూర్/శేరిలింగంపల్లి జోన్ బృందం (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి నియోజకవర్గాల్లో స్వామి వివేకానంద జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీవీనగర్‌లో జరిగిన జాతీయ యువజన దినోత్సవం, వివేకానంద జయంతిలో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. యువత స్వామి వివేకానంద స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. భారతదేశ పేరు ప్రఖ్యాతులు ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు స్వామి వివేకానంద అని బీజేపీ కూకట్‌పల్లి నియోజకవర్గం ఇన్‌చార్జి మాధవరం కాంతారావు అన్నారు. యువత వివేకానంద చూపిన మార్గంలో నడవాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ గాంధీనగర్‌లో 125 మంది యువకులు రక్తదానం చేశారు. యువత సేవా మార్గాన్ని అలవర్చుకోవాలని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. సూరారం లూయిస్ బ్రెయిలీ భవన్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.


వివేకానంద జయంతిలో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ రోజాదేవి తదితరులు


వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జనసేన నాయకులు


నివాళులర్పిస్తున్న మాధవరం కాంతారావు తదితరులు


రక్తదానం చేసిన వారికి జ్ఞాపికలు అందజేస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్


వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్


బౌరంపేటలో వివేకానంద విగ్రహానికి పూలమాల వేస్తున్న కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి

జీవో 59ను దుర్వినియోగం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నానక్‌రాంగూడ సర్వేనెంబర్ 149లో ప్రభుత్వ భూమిని అన్యాక్రాంతం చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వ హయాంలో జీవో నెంబర్ 59ను దుర్వినియోగం చేస్తూ కొంత మంది అక్రమార్కులు ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు లేకున్నా విద్యుత్, నల్లా బిల్లులు లేకుండానే దరఖాస్తు చేసుకొని కోట్ల రూపాయల విలువగల భూమిని సొంతం చేసుకున్నారని తెలిపారు. వారికి సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో గచ్చిబౌలి డివిజన్ ఉపాధ్యక్షుడు తిరుపతి, సీనియర్ నాయకుడు మన్నె రమేష్ తదితరులు ఉన్నారు.


అక్షింతలు పంపిణీ చేస్తున్న మహేష్‌యాదవ్ తదితరులు

అయోధ్య రామయ్య అక్షింతల పంపిణీ

మియాపూర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): అయోధ్య రామయ్య అక్షింతలకు హఫీజ్‌పేట హనుమాన్ ఆలయంలో శుక్రవారం పూజలు చేశారు. బోయిని మహేష్‌యాదవ్ ఆధ్వర్యంలో ఇంటింటికీ పంపిణీ చేశారు. స్థానికులు అనూషయాదవ్, బాలింగ్ యాదగిరిగౌడ్, నరేందర్‌గౌడ్, గౌతమ్‌గౌడ్, మల్లేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్స్ రెడ్డీస్ కాలనీలో

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి : కార్పొరేటర్

మియాపూర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): డాక్టర్స్ రెడ్డీస్ కాలనీలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ శుక్రవారం పర్యటించారు. కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానన్నారు. యూజీడీ, సీసీ రోడ్డు పనులు పూర్తి చేయాలని అధికారులను కోరారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న హస్తకళా ఉత్పత్తులు


హస్తకళా ఉత్పత్తులు కొనుగోలు చేస్తున్న సందర్శకులు

రాయదుర్గం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): శిల్పారామంలో నిర్వహిస్తున్న గాంధీ శిల్పబజార్‌లో ఏర్పాటు చేసిన హస్తకళా ఉత్పత్తులు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం గాయత్రీ నృత్య కళాక్షేత్ర గురు శ్రీవైష్ణవి శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఆహూతులను అలరించింది.

సమాచార హక్కు చట్టానికి..

తూట్లు పొడిచిన బీజేపీ, బీఆర్‌ఎస్

- ప్రొఫెసర్ కోదండరాం

ఎల్‌బీనగర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రజల చేతిలో పాశుపతాస్త్రంగా ఉండాల్సిన సమాచార హక్కు చట్టానికి కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు తూట్లు పొడిచాయని ప్రొఫెసర్ కోదండరాం ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తపేటలో బాబూ జగ్జీవన్‌రామ్ భవన్‌లో సమాచార హక్కు వికాస సమితి 8వ రాష్ట్ర మహాసభ జరిగింది. ప్రొఫెసర్ కోదండరాం, సమాచార హక్కుకమిషన్ పూర్వ ప్రధాన సమాచార కమిషనర్ వర్రె వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. సమాచార హక్కు వికాస సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కృష్ణారెడ్డి, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కాచం సత్యనారాయణ గుప్తా ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను కోదండరాం, వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. కోదండరాం మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టం రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు దోహదపడిందన్నారు. ఈ చట్టం ద్వారా ప్రభుత్వంపై ప్రజలకు పట్టు పెరుగుతుందన్నారు. త్వరలో ప్రభుత్వం సమాచార హక్కు కమిషన్‌ను నియమిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. వర్రె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టం బలోపేతం కోసం రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. సభలో దైవాదీనం, గోనారెడ్డి, వినోద్‌రెడ్డి, ఎండీ ఖలీల్ పాల్గొన్నారు.

గుండెపోటుతో కార్మిక నాయకుడి మృతి

బాలానగర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో హెచ్‌ఏఎల్ కార్మిక నాయకుడు శుక్రవారం మృతి చెందాడు. దేవులపల్లి యాదయ్య(గిరి) హెచ్‌ఏఎల్‌లో తెలంగాణ ఎంప్లాయీస్ యూనియన్ ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. హెచ్‌ఏఎల్ కార్మిక, బీఆర్‌ఎస్ నాయకులు నివాళులర్పించారు.

వృద్ధుడి మెడలో బంగారు గొలుసు అపహరణ

జీడిమెట్ల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): వృద్ధుడి మెడలో బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తి అపహరించాడు. గాజులరామారం ఇందిరానగర్ అలంకి రెసిడెన్సీలో నివసిస్తున్న గౌరెడ్డిగారి సంగరారెడ్డి(68) శుక్రవారం సాయంత్రం 5 గంటల సమయంలో ఉషాముళ్లపూడి ఆస్పత్రి మెయిన్ గేట్ సమీపంలో వాకింగ్ చేస్తున్నాడు. గుర్తుతెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి ఆయనను కౌగిలించుకొని శుభాకాంక్షలు తెలిపాడు. అతడు వెళ్లిపోయిన పది నిమిషాల తర్వాత సంగరారెడ్డి మెడలో చూసుకోగా ఒకటిన్నర తులం బంగారు గొలుసు కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు జగద్గిరిగుట్ట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేదల సంక్షేమం కోసమే పథకాలు

- కేంద్ర విద్యుత్‌శాఖ మంత్రి ఆర్‌కే సింగ్


మహిళలతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి ఆర్‌కే సింగ్

కవాడిగూడ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న పథకాలు దేశంలోని ప్రతి పేదోడి అభివృద్ధి కోసమేనని కేంద్ర విద్యుత్‌శాఖ మంత్రి ఆర్‌కే.సింగ్ అన్నారు. శుక్రవారం కవాడిగూడ బీమా మైదాన్ వాంబే కాలనీలో వికసిత భారత్ సంకల్పయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలన వల్లే దేశం బలమైన ఆర్థిక వ్యవస్థగా నిలదొక్కుకుందని అన్నారు. భారత్ అన్ని రంగాల్లో శక్తిమంతమైన దేశంగా మారిందని, ప్రతి పేదవాడికి అభివృద్ధి ఫలాలు చేరువ చేయడమే బీజేపీ లక్ష్యమని అన్నారు. పీఎం ఉజ్వల యోజన, ఆయుష్మాన్ భారత్ పథకాలతో పేదల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం తోడ్పాటునందిస్తుందన్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల సమాచారంతో కూడిన బ్రోచర్, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వశాఖకు చెందిన సమాచార డిజిటల్ వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. కేంద్ర సమాచార శాఖ అధికారి బాలకృష్ణ, ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ దేబాషిష్ మిత్ర, సెంట్రల్ బ్యూరో కమ్యూనికేషన్ ఏజీఎం హరిబాబు, కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ, బీజేపీ ముషీరాబాద్ కన్వీనర్ ఎం.రమేష్‌రాం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జీఎం శ్రీ కృష్ణన్, ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గసభ్యులు పూసరాజు, రాష్ట్ర నాయకులు పరిమళ్‌కుమార్, జి.వెంకటేష్, అధ్యక్ష కార్యదర్శులు ఎంసి.మహేందర్‌బాబు. ఎ.ప్రభాకర్ గంగపుత్ర, కేశవరాజు, సలంద్రి దిలీప్‌యాదవ్, అనిల్ పాల్గొన్నారు.


ఇందిరాగాంధీ విగ్రహావిష్కరణలో కాంగ్రెస్ నాయకులు

ఇందిరాగాంధీ సేవలు మరువలేనివి

వివేకానందనగర్‌కాలనీ/జీడిమెట్ల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చేసిన సేవలను ప్రజలు మర్చిపోలేరని కాంగ్రెస్ నాయకులు అన్నారు. జగద్గిరిగుట్ట బస్టాప్ వద్ద పునర్ నిర్మాణం చేసిన ఇందిరాగాంధీ విగ్రహాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జిలు కొలన్ హన్మంత్‌రెడ్డి, జగదీశ్వర్‌గౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, జెరిపేటి జైపాల్, రఘునందన్‌రెడ్డి, మహిపాల్ యాదవ్, అవిజే జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

'పెరుగుతోన్న హిందీ మాట్లాడే వారి సంఖ్య'

చందానగర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): గంగారం సుమన్ మహిళా దక్షిత సమితి కళాశాలలో విశ్వహిందీ దివస్ కార్యక్రమం నిర్వహించారు. బద్రుక కళాశాల హిందీ విభాగం ఉప ఆచార్యులు సుష్మాదేవి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రపంచ దేశాల్లో హిందీ మాట్లాడే వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతుందన్నారు. కానీ.. దేశంలో హిందీ భాషాభివృద్ధికి కృషి చేయడం లేదన్నారు. విశ్వవ్యాప్తంగా భవిష్యత్‌లో హిందీ భాష ప్రాముఖ్యత పెరగనుందన్నారు. డాక్టర్ రాజేష్, డాక్టర్ మహేశ్వరి, సంఘ సేవకురాలు మీనాక్షి, కళాశాల ప్రిన్సిపాల్ రమాకుమారి, ట్రస్టు మెంబర్ అనసూయ, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సుశీల్‌పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

జలవాయు విహార్ కాలనీలో ఎమ్మెల్యే గాంధీ పర్యటన

హైదర్‌నగర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): జలవాయు విహార్‌కాలనీలో ఎమ్మెల్యే గాంధీ శుక్రవారం పర్యటించారు. కాలనీలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. కాలనీలో ఇంటింటికి వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం భీమునికుంట చెరువు అలుగును పరిశీలించారు. కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఏఈ విశ్వం, జలమండలి డీజీఎం వెంకటేశ్వర్లు, మేనేజర్ ప్రశాంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

రేగులకుంట చెరువు సుందరీకరణ పనుల పరిశీలన

మియాపూర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): దీప్తిశ్రీనగర్‌లోని రేగులకుంట చెరువు సుందరీకరణ పనులను ఎమ్మెల్యే గాంధీ అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. సేల్స్‌ఫోర్స్ ఐటీ కంపెనీ సీఎస్‌ఆర్ ఫండ్స్ రూ.1.50 కోట్లతో పనులు చేస్తోంది. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చెరువులో మురుగునీరు చేరకుండా కాల్వ, చెరువు కట్ట బలోపేతం చేయాలని, అలుగు మరమ్మతు, వాకింగ్ ట్రాక్ పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. డీఈ నళిని, ఏఈ పావని, సేల్స్‌ఫోర్స్ ఐటీ కంపెనీ ప్రతినిధులు చైతన్య, రాము పాల్గొన్నారు.

పీజేఆర్‌కు నివాళి


కేపీహెచ్‌బీలో పీజేఆర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేస్తున్న జి.వెంగళరావు తదితరులు

కూకట్‌పల్లి/శేరిలింగంపల్లి జోన్ బృందం (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి నియోజకవర్గాల్లో పీజేఆర్ జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలకు కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీజేఆర్ చేసిన సేవలను కొనియాడారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని నేటి యువత ప్రజా సేవ చేయాలని కాంగ్రెస్ శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇన్‌చార్జి వి. జగదీశ్వర్‌గౌడ్ సూచించారు.


పాపిరెడ్డి కాలనీలో పీజేఆర్‌కు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


నివాళులర్పిస్తున్న పీజేఆర్ ఫౌండేషన్ కూకట్‌పల్లి అధ్యక్షుడు కర్క నాగరాజు, మల్లు రమేష్ ట్రస్టు ఛైర్మన్ మల్లు ప్రతిభ తదితరులు